క్లుప్తంగా

శాస్త్రోక్తంగా చండీహోమం


చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో నెలవారీ పూజల్లో భాగంగా ఆషాడమాసం, సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 26 మంది దంపతులు పాల్గొన్నారు. భక్తులకు స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖధారమ్మకు సారె


అమ్మవారికి సారె తీసుకెళ్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావి చెరువుగట్టున కొలువై ఉన్న ముఖధారమ్మవారికి ఆషాడం సారె సమర్పించారు. సోమవారం మధ్యాహ్నం మహిళలు వివిధ రకాల స్వీట్లు, చలివిడి, పానకంతో వార్డులో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించుకున్నారు. అమ్మవారికి ఆషాడంలో సారె సమర్పించడం ఇదే తొలి సారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల చిన రాజా చెప్పారు. ఆలయ గౌరవాధ్యక్షుడు దు వల్లభ శ్రీను, సెక్రటరీ చినిమిల్లి బాబి, చెక్కా కృష్ణ, జాన మురళి, బొర్రా చినబాబు, మిద్దే రాము, బెల్లంకొండ నరసింహారావు పాల్గొన్నారు.

పింఛన్ అందజేత


కేపీపాలెంలో పింఛన్ అందజేస్తున్న నేతలు

మొగల్తూరు: మండలంలోని కేపీపాలెం సౌత్ పంచాయతీకి చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు వినుకొండ దుర్గాప్రసాద్‌కు పింఛన్ మంజూరైంది. సోమవారం దుర్గాప్రసాద్‌కు తన నివాసం వద్ద రూ.10 వేల పింఛన్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. నాయకులు అల్లం చిన్న, యాళ్ల నరసింహారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ విగ్నేశ్వరరావు, వలంటీర్ కత్తుల నరసింహ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ మహిళల జట్టుకు అభినందనలు


జట్టు సభ్యులతో అసోసియేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా మహిళల జట్టు విజయం సాధించడం అభినందనీయమని జిల్లా బాస్కెట్‌బాల్ గౌరవ అధ్యక్షుడు మద్దాల వాసు పేర్కొన్నారు. నూజివీడులో ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తూర్పుగోదావరి జిల్లాపై విజయం సాధించిన పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారులకు వాసు సోమవారం అభినందనలు తెలిపారు. బాస్కెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, సెక్రటరీ జి.శ్రీనివాస్, టీం కోచ్ జి.మురళి పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో వ్యవహరించాలి

నరసాపురం రూరల్: ప్రకృతి విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, వరదలు, హార్ట్‌ఎటాక్ సమయాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించాలని 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ ఫింటు నందు సూచించారు. నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జాతీయ విపత్తుల నిర్వహణ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. తహసీల్దార్ ఫాజిల్, కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం


విద్యార్థినులకు సైకిళ్లు అందజేసిన దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: దాతల సహకారం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు కోట శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. తమ పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ పీర్‌సాహెబ్ సహాయం కోరడంతో ఎన్ఆర్ఐ జనపరెడ్డి సుస్మిత రూ.13 వేలతో రెండు సైకిళ్లు ఏర్పాటు చేశారని శ్రీనివాస్ చెప్పారు. వీటిని విద్యార్థినులు జుత్తిగ శ్రావణి, బాలం భువనేశ్వరిలకు సోమవారం అందజేశామన్నారు.

ఎల్బీచర్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

- చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు
- పేద విద్యార్థులకు బాసటగా అమ్మఒడి


ఎల్బీచర్ల హైస్కూల్లో అమ్మఒడి నమూనా చెక్కును ప్రదర్శిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ఎల్బీచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. సోమవారం నరసాపురం మండలం ఎల్బీచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన నాలుగో విడత అమ్మఒడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదరికాన్ని రూపుమాపేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యావిధానంలో సమూల మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో ఇప్పటికే కొప్పర్రు, కేపీపాలెంలలో కళాశాలలు ప్రారంభయయ్యాయని, త్వరలో ఎల్బీచర్ల, ముత్యాలపల్లి గ్రామాల్లోనూ జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. నరసాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కూడా తీసుకొస్తున్నట్టు వెల్లడించారు. నియోజకవర్గంలో ఒక్క జూనియర్ కళాశాల కూడా మంజూరు చేయించలేని గత పాలకులు తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. తమ హయాంలో నాలుగు జూనియర్ కళాశాలలతోపాటు ఆక్వా యూనివర్సిటీ, మెడికల్ కళాశాలను ఈ ప్రాంతంలోనే మంజూరు చేసుకున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు మెడికల్ కళాశాలలను దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకొస్తే ఆయన తనయుడు సీఎం జగన్ 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారని వివరించారు. నరసాపురం నియోజకవర్గంలో నాలుగో విడత అమ్మఒడి పథకం ద్వారా 18 వేల మంది తల్లుల ఖాతాల్లో రూ.26 కోట్లు జమయినట్టు చెప్పారు. విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకురావడం వల్ల మట్టి నుంచి మాణిక్యాలు బయటకొస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పోటీ పడేలా మార్చి చూపించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గోరుముద్ద పథకం ద్వారా పిల్లలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. గతంలో తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలనే తపన ఉన్నా ఆర్థిక ఇబ్బందుల వల్ల పనులకు పంపేవారని గుర్తుచేశారు. అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేసి పేద కుటుంబాలకు ప్రోత్సాహం అందిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే స్టేట్ ర్యాంకులతో ప్రథమ స్థానంలో నిలుస్తున్నారని ప్రసాదరాజు తెలిపారు. ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంట్ర వీరన్న, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఇంజేటి జాన్ కెనడీ తదితరులు మాట్లాడుతూ ఒక కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలంటే.. విద్యతోనే సాధ్యమవుతుందని భావించిన సీఎం జగన్ విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని, ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారని వివరించారు. పలువురు విద్యార్థులు ఆంగ్లంలో తమ అభిప్రాయాలను సభికులతో పంచుకున్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, ఎంఈఓ పి.పుష్పరాజ్యం, రాట్నాల రాము, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సీఆర్పీలు, మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, బీసీ, మైనార్టీలకు అండగా వైఎస్సార్‌సీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో నరసాపురం నియోజకవర్గ బసీసెల్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, పెద్దలతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలుగా అంగడా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో బీసీ కేటగిరీలో 139 కులాలకు 56 కార్పొరేషన్లు, ఆయా కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించిన ఘనత వైఎస్సార్‌సీపీదే అని అన్నారు. బీసీలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సమస్యల పరిష్కారంలో తానెప్పుడూ ముందుంటానని, ఎవరికి ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కుల, మత, వర్గ విభేదాలు లేకుండా ఐకమత్యంగా కలిసి పనిచేసి సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. సోషల్ మీడియాలో మరింత ఉత్సాహంగా పాల్గొని ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరారు.

నేడు జగనన్న సురక్ష గ్రామ సభలు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం సౌత్-1 సచివాలయ పరిధిలో తహసీల్దార్ జి.అనితా కుమారి, మొగల్తూరు-2 సచివాలయ పరిధిలో ఎంపీడీఓ వి.బాబ్జిరాజు పర్యవేక్షణలో మంగళవారం జగనన్న సురక్ష సభలు నిర్వహించనున్నారు. ఈ సభల్లో అర్హులకు ధ్రువపత్రాలు అందజేయనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

నేడు పోడూరు, గుమ్మలూరుల్లో..

పోడూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఎంపీడీఓ డి.సుహాసిని పర్యవేక్షణలో గుమ్మలూరు-1 సచివాలయం వద్ద, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు పర్యవేక్షణలో పోడూరు-2 సచివాలయం వద్ద సభలు నిర్వహించనున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముఖ్యఅతిధిగా హాజరవుతారని, అర్హులకు ధ్రువపత్రాలు అందజేయనున్నారని ఎంపీడీఓ సుహాసిని తెలిపారు.

ఘనంగా ప్రపంచ మెకానిక్‌ల డే

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచ మెకానిక్‌ల డే సందర్భంగా స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి మోటార్ సైకిల్ మెకానిక్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష కార్యదర్శులు మైగాపుల శ్రీనివాసరావు, బొర దుర్గారావు, సభ్యులు కొర్ర రామారావు, కశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు


దిగమర్రులో బాబావార్కి వెండి కిరీటాన్ని అలంకరిస్తున్న దాతలు


జుత్తిగ షిర్డీసాయిబాబా


పెనుగొండ షిర్డీ సాయిబాబా


రామన్నపాలెం సాయిబాబావారు

- బాబాకు వెండి కిరీటం సమర్పణ
- భక్తులతో కిటకిటలాడిన మందిరాలు

పాలకొల్లు సెంట్రల్: గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం పాలకొల్లు మండలంలోని దిగమర్రు షిర్డీ సాయిబాబా మందిరంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా దాత గుణ్ణం విశ్వేశ్వరరావు దంపతులు 1.4 కేజీల వెండి విగ్రహాన్ని బాబాకు అలంకరించారు. బాబా మందిర కమిటీ సభ్యులు దాత దంపతులను సత్కరించారు. పట్టణంలోని పెద్ద సాయిబాబా, చిన కూరగాయల మార్కెట్ బాబా, బంగారు వారి చెరువు గట్టు, మండలంలో దగ్గులూరు, లంకలకోడేరు గ్రామాల్లో బాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలు ఏర్పాటుచేశారు.

జుత్తిగలో..

పెనుమంట్ర: జుత్తిగ ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామికి షిర్డీ సాయిబాబావారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సోమేశ్వరస్వామివారికి రుద్రాభిషేకాలు, బాబావారికి పంచామృతాభిషేకాలు, షిర్డీసాయిబాబావారికి లక్ష బిల్వార్చన పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అర్చకుడు కొత్తలంక లక్ష్మీసంతోష్‌శర్మ పూజలు చేయగా, ఆలయ కార్యనిర్వాహకులు తమనంపూడి వీర వెంకటనాగిరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెనుగొండ మండలంలో..

పెనుగొండ: గురుపౌర్ణమి వేడుకలు పెనుగొండ, ఆచంట మండలాల్లో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి షిర్డీ సాయినాథుని మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. పెనుగొండ షిర్డీసాయి మందిరంలో ఉదయం నుంచి పంచామృతాభిషేకంలు, హారతులు, లక్ష తులసి పూజ చేశారు. వడలిలో సాయినాథునికి ప్రత్యేక పూజలు, అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. సిద్ధాంతంలో జ్ఞాన సరస్వతి షిర్డీ సాయి ఆలయంలో ఉదయం నుంచి పూజలు, అభిషేకంలు నిర్వహించి అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. పెనుగొండ లింగాల వీధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొగల్తూరు మండలంలో..

మొగల్తూరు: మండలంలోని షిర్డీ సాయి బాబా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. మొగల్తూరు, కేపీపాలెం, పేరుపాలెం, కాళీపట్నం, రామన్నపాలెం గ్రామాల్లోని బాబా మందిరాలకు వేకువజాము నుంచే భక్తులు తరలి వచ్చారు. బాబాకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నసమారాధనలో పాల్గొని బాబా వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

తుదిదశకు కైలాసభూమి అభివృద్ధి పనులు


మార్టేరులో హిందూ శ్మశానం వద్ద నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు

పెనుమంట్ర: మార్టేరు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు తుదిదశకు చేరాయి. ఈ శ్మశాన వాటిక పక్కనే ఉదయభాస్కరరెడ్డి దానం చేసిన స్థలంలో స్నానఘట్టం నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. హిందూ శ్మశాన వాటికకు సరైన స్థలం లేకపోవడంతో మార్టేరు - కోడేరు రోడ్డులో ఉన్న పంచాయతీ డంపింగ్‌యార్డు స్థలంలో మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించే వారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లేది. దహన సంస్కారాలకు వచ్చే ప్రజలు, ఆ సయమంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో సొసైటీ మాజీ అధ్యక్షుడు వెలగల నారాయణరెడ్డి, మరో 14 మంది అభివృద్ధి కమిటీగా ఏర్పడ్డారు. శ్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారంచుట్టారు. శ్మశాన వాటిక స్థలంలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో రెండు కట్టెల బీడు పాయ్యలు, విశ్రాంతి భవన నిర్మాణ పనులు రెండు నెలల క్రితం చేపట్టారు. ఈ శ్మశాన వాటిక పక్కనే ఉదయభాస్కరరెడ్డి దానం చేసిన స్థలంలో స్నానఘట్టం నిర్మాణ పనులు కూడా చేపట్టారు. ఈ పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తి, ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు సహకారం, దాతల విరాళాలతో పనులు త్వరితగతిన పూర్తిచేయగలుగుతున్నామని అభివృద్ధి కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేత కొవ్వూరి బ్రహ్మేశ్వర రెడ్డి తెలిపారు.

దాతల సహకారం ఇలా..

అభివృద్ధి పనులకు గ్రామానికి చెందిన నూలి పోలేశ్వరరావు తొలి విరాళంగా రూ.50 వేలు అందజేశారు. వెలగల ఉదయభాస్కరరెడ్డి రూ.25 వేలతో పాటు శ్మశాన వాటికకు సమీపంలో కోడేరు మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న నాలుగు సెంట్ల స్థలాన్ని, వెలగల త్రినాథరెడ్డి రూ.3.25 లక్షలు విరాళంగా అందజేశారు. ఇంకా పలువురు శ్మశాన వాటిక అభివృద్ధికి తమ వంతు విరాళాలు అందజేశారు.

అందరికీ ఉపయోగపడేలా



దహన సంస్కారాలకు మార్టేరు హిందువులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అభివృద్ధి కమిటీ చేసిన పనులను ప్రోత్సహించేందుకు తనవంతుగా స్థలం దానం చేశాం. మంచి కోసం ఉపయోగపడాలనే ఉద్దేశంతో రూ.40 లక్షలు విలువచేసే నాలుగు సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చాం.
– వెలగల ఉదయభాస్కరరెడ్డి, రైస్‌మిల్లర్, మార్టేరు

రైతుల ఖాతాలకు పంట బీమా జమ

యలమంచిలి: గతేడాది ఖరీఫ్ పంటలో నిర్వహించిన పంట కోత ప్రయోగంలో ఏడు సీజన్‌ల సరాసరిలో తక్కువ దిగుబడి నమోదైనందున చించినాడ, ఏనుగువానిలంక గ్రామాల్లో 31 మంది రైతులకు రూ.12,63,035 పంట బీమా పరిహారం మంజూరైందని మండల వ్యవసాయ అధికారి చిందులూరి దేవి తెలిపారు. చించినాడలో 10 మంది రైతులకు ఎకరాకు రూ.37,377 చొప్పున 9.38 ఎకరాలకు రూ.3,50,597, ఏనుగువానిలంకలో 21 మందికి 24.4 ఎకరాలకు రూ.9,12,438 మంజూరైందని, రైతుల ఖాతాల్లో జమైందని చెప్పారు.

మానవత సేవలు అభినందనీయం


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

పాలకొల్లు సెంట్రల్: మానవత సేవా సంస్థ సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సోమవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో మానవత సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మానవత సంస్థ విద్య, వైద్యంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ముత్యాల శ్రీనివాసు, సెక్రటరీగా పీఎస్ ప్రతాప్‌రాజు, ట్రెజరర్‌గా మద్దాల వాసు, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. వీరికి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీలు మేకా శేషుబాబు, అంగర రామ్మోహన్, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సేవా సంస్థ చైర్మన్ కేవీ కృష్ణవర్మ, జిల్లా సభ్యులు సాగిరాజు జానకిరామరాజు, రామిశెట్టి గంగాదర్, ముత్యాల రామారావు, డాక్టర్ కేఎస్‌పీఎస్ వర్మ, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త తదితరులు అభినందనలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్యాలకు దూరంగా ఉండాలంటే పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. సబ్ యూనిట్ అధికారి ఎం.రాజ్‌కుమార్, డాక్టర్ ఎం.నవ్య, డాక్టర్ జి.భవానీప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, జి.ఉదయ్ చందర్ పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవడమే లక్ష్యం

యలమంచిలి: జాతి, కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత సంస్థ లక్ష్యమని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు పేర్కొన్నారు. సంస్థ యలమంచిలి శాఖ ఏర్పాటుకు మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ ఇంటి వద్ద సోమవారం మండలంలోని వివిధ గ్రామాల వారితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మానవత జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ సాగిరాజు జానకి రామరాజు, పాలకొల్లు శాఖ కార్యదర్శి పీఎస్ ప్రతాపరాజు యలమంచిలి మండలానికి చెందిన గుర్రాల వెంకట్రావు, డేగల వెంకటేశ్వరరావు, వలవల యజ్ఞ ప్రసాద్, తోటకూర అప్పల నరసింహరాజు, కె నరసింహారావు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం


డ్రెయిన్ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీపీ పెద్ద

పెనుగొండ: స్థానిక అంబేడ్కర్ కాలనీ ప్రజల మురుగు సమస్యకు మోక్షం కలుగనుంది. మండల పరిషత్ నిధులు రూ.13 లక్షలతో డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ పనులను పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), ఎంపీటీసీ మద్దింశెట్టి లక్ష్మి, పంచాయతీ సభ్యురాలు మేడపాటి నీలిమా సునీల్, అకింశెట్టి చంటి, కాకిలేటి బాపిరాజు, తిక్కిరెడ్డి పవన్‌కుమార్‌లు పర్యవేక్షించారు. 15 ఏళ్లుగా డ్రెయిన్ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాలనీ వాసులు ప్రదక్షిణలు చేశారు. మురుగు నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెంది జ్వరాల బారిన పడేవారు. సమస్యను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు, ఇటీవల నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలోనూ విన్నవించుకొన్నారు. సత్వరం డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు


గాయపడిన వినీల

మొగల్తూరు: స్థానిక సత్రవుపాలెంలో సోమవారం కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులు, పెద్దాయనొకరికి గాయాలయ్యాయి. ఇంటి వద్ద ఆడుకుంటున్న పంపన వినీలను బుజంపై గాయపర్చగా, సీలంశెట్టి లాస్య ప్రియను కాలు, పిక్కలపైనా, రేవు నరసింహస్వామి అనే వ్యక్తి పొట్టపై, చేతిపైన గాయపర్చాయి. వారిని ఆసుపత్రికి తరలించి రేబిస్ ఇంజక్షన్లు చేయించారు. తమ ప్రాంతంలో కుక్కలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

నరసాపురం రూరల్: పేకాట శిబిరాలపై ఆదివారం అర్ధరాత్రి దాడి చేసి రూ.53 వేలు, స్వాధీనం చేసుకున్నట్టు నరసాపురం పట్టణ ఎస్సై బి.ప్రసాద్ తెలిపారు. నరసాపురం ఆదర్శనగర్ వైఎస్సార్ కాలనీ వద్ద పేకాడుతున్న ఆరుగురి నుంచి రూ.20,470, అధికారివారి వీధిలో ఏడుగురి నుంచి రూ.33,200, నాలుగు బైకులు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.